

చీనీ టన్ను రూ.37 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.37 వేలు పలికాయి.



ఐదు రోజుల్లో వర్షాలు

జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు శాస్త్రవేత్తలు సహదేవరెడ్డి, అశోక్‌కుమార్ తెలిపారు.

గరిష్టం/కనిష్టం
40.2°/24.6°

జిల్లా అంతటా శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవి తాపం, ఉక్కపోత అధికంగా ఉంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

ఉరవకొండలో 2న మెగా జాబ్‌మేళా



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జూన్ రెండో తేదీన ఉరవకొండ మహాత్మా డిగ్రీ కళాశాలలో 12 కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ గౌతమి శుక్రవారం ఆవిష్కరించారు. పది, ఇంటర్మీడియెట్, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, పీజీ చదివి, 18 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు ఉన్న వారు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. ఉద్యోగానికి ఎంపికైన వారికి నెలకు రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు జీతభత్యాలు ఉంటాయని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు రెండో తేదీ నేరుగా బయోడేటా, సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 90100 39901, 80967 63970, 83175 20929 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బెదిరింపు కేసులో నిందితుడి అరెస్ట్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) వీరబ్బాయిని ఫోన్‌లో బెదిరించిన కేసులో అనంతపురం టూటౌన్ పోలీసులు పురోగతి సాధించారు. బెదిరింపు కాల్ చేసిన కళ్యాణదుర్గం మండలం ముద్దినాయనపల్లికి చెందిన సాకే గంగాధర్‌ను శుక్రవారం అరెస్ట్ చేశారు. అబార్షన్ల కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న డాక్టర్ లక్ష్మీ కాంతమ్మకు గంగాధర్ స్వయానా మరిది. నిందితుడిని విచారణ చేస్తున్నట్లు టూటౌన్ సీఐ శివరాముడు తెలిపారు.

ఎస్కేయూ డిగ్రీ పరీక్షలు వాయిదా



అనంతపురం: ఎస్కేయూ పరిధిలో జూన్ 5 నుంచి నిర్వహించనున్న డిగ్రీ పరీక్షలు వాయిదా వేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ శ్రీరాములు నాయక్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న పీజీ కోర్సు ప్రవేశపరీక్ష షెడ్యూల్ ఇదే సమయంలో ఉన్నందున విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా వాయిదా వేయాలని ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారన్నారు. జూన్ 5 నుంచి జరగాల్సిన పరీక్షలు అదే నెల 15 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ ఐదో సెమిస్టర్ రెగ్యులర్, ఆరో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 15 నుంచి ప్రారంభం కానున్నాయని తెలిపారు.

అనంతపురం తపాలా ఏఎస్పీ బదిలీ

అనంతపురం సిటీ: అనంతపురం తపాలా శాఖ డివిజన్ కార్యాలయంలో అదనపు సూపరింటెండెంట్ (ఏఎస్పీ)గా పని చేస్తున్న డి.పార్వతిని నంద్యాల డివిజన్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు ఆ శాఖ కర్నూలు రీజియన్ పీఎంజీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే పార్వతి స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. అలాగే గుంతకల్లు ఏఎస్పీగా ఎంవీవీ భాస్కర్‌రెడ్డిని నియమించారు. ఆయన నంద్యాలలో పని చేస్తుండగా, గుంతకల్లుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

32 వేల క్వింటాళ్లకు రిజిస్ట్రేషన్లు



అనంతపురం అగ్రికల్చర్: సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ కోసం ఆర్‌బీకే వేదికగా రిజిస్ట్రేషన్లు జోరుగా కొనసాగుతున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏఓ) బి.చంద్రానాయక్ శుక్రవారం తెలిపారు. ప్రస్తుతానికి 36,300 మంది రైతులు 32 వేల క్వింటాళ్ల విత్తనకాయల కోసం పేర్లు నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు. వేరుశనగతో పాటు కందులు, పెసలు, కొర్రలు, రాగులకు కూడా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్లు తెలిపారు. శుక్రవారం నాటికి 221 ఆర్‌బీకేల పరిధిలో 17 వేల క్వింటాళ్ల విత్తన వేరుశనగ నిల్వ చేసినట్లు ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ జె.ధనలక్ష్మి తెలిపారు.

పెళ్లి సంబంధం కుదరడం ఇప్పుడు పెద్ద సవాలుగా మారింది. పరిచయ వేదికలు, పేరయ్యలు, బంధువర్గమంతా గాలించినా సరైన జోడీ కుదరక నానా తంటాలు పడుతున్నారు. అమ్మాయికి గరిష్టంగా 25 ఏళ్లకైనా కావాల్సిన పెళ్లి వాయిదాల పర్వంతో 30 దాటుతోంది. లేటు మ్యారేజీల వల్ల లేనిపోని సమస్యలు తలెత్తుతున్నాయి. ఈడూ జోడు కుదిరి పాతికేళ్ల వయసు దాటకుండా పెళ్లయితే ఆరోగ్య వంతులైన పిల్లలు పుడతారు. కానీ అబ్బాయికి 35, అమ్మాయికి 30 దాటాక పిల్లలు కనడం అతి పెద్ద ఇబ్బంది అయ్యింది.



ఎదురుచూపులు

- సంబంధం అంటే సవాలే..
- రకరకాల కారణాలతో పెళ్లిళ్లు జాప్యం
- లేటు మ్యారేజీలతో జంటల్లో కొత్త సమస్యలు
- కుటుంబాల్లో చదువులు, జాతకాలు, ఆస్తులు కీలకపాత్ర
- లేటు మ్యారేజీలతో రెండో సంతానం అసాధ్యమవుతోంది
- ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో భారీగా పడిపోతున్న జననాల రేటు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఒకప్పుడు వధూవరుల ఎంపికలో పెద్ద పట్టింపులు లేవు. ఇప్పుడేమో పట్టిపట్టి చూస్తున్నారు. జాతకాలు కలవాలి. చదువు, ఉద్యోగంలో అమ్మాయిల స్థాయిని చూస్తున్నారు. అన్నీ కుదిరినా జాతకం కుదరకపోతే చివరి నిమిషంలో సంబంధం రద్దు చేసుకుంటున్నారు. ఒకవేళ జాతకం కుదిరినా అబ్బాయి తరపు ఆడపిల్లలు ఎక్కువ మంది ఉన్నా.. మంచి ఉద్యోగం ఉండి ఆస్తి లేకపోయినా అమ్మాయిలు ఒప్పుకోవడం లేదు. ఇలా రకరకాల సమస్యలతో 30 ఏళ్ల తర్వాత పెళ్లి చేసుకున్న జంటలు తదనంతరమూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తేలింది.

ఏటా 55 వేలకు పైగా పెళ్లిళ్లు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏటా 55వేలకు పైగా పెళ్లిళ్లు జరుగుతుండగా.. అందులో 30 శాతం లేటు మ్యారేజీలే. ఇందులో ఎక్కువగా స్థాయికి తగ్గట్టు సంబంధాలు కుదరకపోవడమే. అన్నిటికీ మించి లేటు మ్యారేజీల కారణంగా హార్మోన్ల సమతుల్యత లోపించి రకరకాల గర్భకోశ సమస్యలు ఎదుర్కొంటున్నారు. మగవాళ్లలో సైతం ఉద్యోగంలో ఒత్తిళ్ల కారణంగా యుక్తవయసులోనే డయాబెటిక్, హైపర్‌టెన్షన్ సమస్యలు ఎదుర్కొని లైంగిక సమస్యలతో సంతానానికి నోచుకోలేకపోతున్నారు.

అసలే సమస్యలు.. ఆపై గ్యాప్

పెళ్లిళ్లు కావడమే జాప్యం జరుగుతూ ఉంటే వీరిలో 70 శాతం మంది వెంటనే బిడ్డలు పుట్టకుండా ఓరల్‌పిల్స్ తీసుకుంటున్నట్టు వైద్యులు చెబుతున్నారు. దీంతో 40 ఏళ్లు సమీపిస్తున్న వేళ తొలి కాన్పు అవుతోంది.


- ఇక రెండో కాన్పునకు అవకాశమే లేకుండా పోతోంది. ఈ కారణాలతో జిల్లాలో జనన రేటు గణనీయంగా పడిపోయినట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఒక జంట సగటున ఇద్దరిని కనాలి..అలాంటి ఈ రేషియో 1.7కు పడిపోయింది. ఇది భవిష్యత్తులో ఇబ్బందికరంగా మారే ప్రమాదముంది.

అనంతపురం జిల్లా జనాభా	22,31,890
శ్రీసత్యసాయి జిల్లా జనాభా	18,05,498
ఉమ్మడి జిల్లాలో ఏటా సగటున పెళ్లిళ్లు	55,000
ఇందులో లేటు మ్యారేజీలు	15,000 వరకు
లేటు మ్యారేజీ వల్ల బిడ్డలు కలగని వారు	14 శాతం
ఒక బిడ్డకే పరిమితమవుతున్న వారు	46 శాతం
ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం జననాల రేటు	1.7

రెండో బిడ్డకు ఇబ్బంది



28 ఏళ్ల లోపు పిల్లలు పుట్టడం పూర్తి కావాలి. కానీ పెళ్లే 30 ఏళ్ల తర్వాత అంటే మొదటి బిడ్డకే ఆగిపోవాల్సి వస్తుంది. చాలామంది పెళ్లవగానే రెండుమూడేళ్లు బిడ్డలు పుట్టకుండా జాగ్రత్తలు పడుతున్నారు. వివాహం లేటు వయసులో చేసుకోవడం వల్ల ఫెర్టిలిటీ (సంతానోత్పత్తి)లో సమస్యలు తలెత్తుతున్నాయి. యుక్తవయసులో పెళ్లి చేసుకుంటేనే ఆరోగ్యవంతమైన బిడ్డలు పుట్టే అవకాశం ఉంది. – డాక్టర్ వినూత్న, గైనకాలజిస్ట్



విలాస జీవితం.. జాతకాల పిచ్చి



బాగా డబ్బుండాలి.. ప్యాకేజీ ఉండాలి.. విలాసవంతమైన జీవితం.. ఇవన్నీ ఇప్పుడు కీలకమయ్యాయి. వీటికి తోడు జాతకాల పిచ్చి ఎక్కువైంది. ఇవన్నీ సరిపోయే అబ్బాయి లేదా అమ్మాయి కావాలంటే ఏళ్ల తరబడి వెతకాల్సిందే. దీంతో వివాహం తీవ్ర జాప్యం అవుతోంది. జీవితంలో సెటిల్ కావడం అనే అర్థమే మారిపోయింది. –సత్యనారాయణ, విశ్రాంత ఉద్యోగి

రిజిస్ట్రేషన్ తర్వాతే వాహనాల డెలివరీ

- నిబంధనలు ఉల్లంఘిస్తే షోరూంలు సీజ్ : డీటీసీ



డీలర్లతో మాట్లాడుతున్న డీటీసీ శివరామప్రసాద్

అనంతపురం సెంట్రల్: కొత్త వాహనాలు కొనుగోలు చేస్తే తాత్కాలిక రిజిస్ట్రేషన్, శాశ్వత రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన తర్వాతే కస్టమర్లకు డెలివరీ చేయాలని ఉప రవాణా కమిషనర్ (డీటీసీ) శివరామప్రసాద్ ఆదేశించారు. ఈ విషయంలో నిబంధనలు అతిక్రమిస్తే షోరూంలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. శుక్రవారం రవాణాశాఖ కార్యాలయంలో జిల్లాలోని వాహనాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. టీఆర్, పీఆర్ లేకుండా వాహనాలను డెలివరీ చేయడం ద్వారా వాహనదారులకు ఇబ్బందులతో పాటు నష్టం ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపారు. కావున ఈ విషయంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు అమ్ముతుండడం వలన ప్రమాదాల సమయంలో అనేక మంది మృత్యువాత పడుతున్నారని తెలిపారు. వ్యవస్థ మొత్తం డిజిటలైజేషన్ కాలం వచ్చిందని, ఏ డీలరు ఎన్ని వాహనాలు అమ్మకాలు చేశారనే వివరాలు ఆన్‌లైన్‌లో తెలుసుకోవచ్చునని వివరించారు. రవాణాశాఖ నిబంధనలు పాటించకపోతే నాలుగు నెలలు సీజ్ చేసే అధికారం ఉందని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు షోరూం వద్ద తప్పనిసరిగా అవగాహన కోసం ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి నెలా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్సీ కార్డుల సమస్య రాష్ట్ర వ్యాప్తంగా ఉందని, త్వరలోనే ఈ సమస్య పరిష్కారం చూపుతామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీఓ సురేష్ నాయుడు, డీలర్లు, పొల్యూషన్ వాహనాల యజమానులు పాల్గొన్నారు.

---

43 గ్రామాల్లో రీ-సర్వే పూర్తి

- 37 వేల మందికి భూ హక్కుపత్రాలు రెడీ
- రెండో దశలో 65 గ్రామాల్లో సర్వే పనులు
- జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్



మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: వైఎస్సార్- జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం కింద జిల్లాలో మొదటి దశలో 43 గ్రామాల్లో చేపట్టిన రీ-సర్వే పూర్తయ్యిందని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. జాయింట్ కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సర్వే భూ రికార్డుల శాఖ ఏడీ కిషోర్‌బాబు, డీఏఓ చంద్రానాయక్‌తో కలిసి రీ-సర్వే, రాగుల పంపిణీ, సబ్సిడీ విత్తన వేరుశనగ అంశాలపై విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్-జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం కింద మొదటి దశలో 43 గ్రామాల్లో చేపట్టిన రీ-సర్వే ప్రక్రియ వంద శాతం పూర్తయ్యిందన్నారు. ఈ గ్రామాల్లో ప్రైవేటు పట్టా భూముల్లో హద్దురాళ్ల ఏర్పాటు పనులు పూర్తి చేశామన్నారు. వెబ్‌ల్యాండ్-2లో వివరాలను నమోదు చేశామన్నారు. ఇప్పటి వరకు 37,982 మందికి భూ హక్కు పత్రాలు వచ్చాయని ఇందులో 35,598 మందికి అందజేశామని, మిగిలిన 2,384 పత్రాలను నాలుగు రోజుల్లో అందజేస్తారని చెప్పారు. ఇక రెండో దశ కింద 65 గ్రామాల్లో రీ-సర్వేకు సంబంధించి డ్రోన్ ఫ్లై పూర్తయ్యిందన్నారు. ప్రతి గ్రామంలో నాలుగు బృందాలతో గ్రౌండ్ ట్రూత్ చేయిస్తున్నామన్నారు. జూలై ఆఖరుకు గ్రౌండ్ ట్రూత్ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు.

జూన్ 1 నుంచి రాగుల పంపిణీ

కార్డుదారులకు కిలో నుంచి 3 కిలోల వరకు ఉచితంగా రాగుల పంపిణీకి చర్యలు చేపట్టామన్నారు. జూన్ 1 నుంచి మొదటగా పట్టణ కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల్లో పంపిణీ చేస్తారన్నారు. ఆ తరువాత మండలాల్లో పంపిణీ చేస్తారన్నారు. జిల్లాలో 57,892 కార్డులకు సంబంధించి 625 టన్నుల రాగులు అవసరం కాగా ఇప్పటికి 290 టన్నులు జిల్లాకు చేరాయన్నారు. మిగిలినవి ఒకటో తేదీలోగా వస్తాయన్నారు.

40 శాతం సబ్సిడీపై విత్తన వేరుశనగ

జిల్లాలో 78వేల క్వింటాళ్ల విత్తన వేరుశనగకాయల అవసరం ఉందని జేసీ తెలిపారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు 40 శాతం సబ్సిడీపై విత్తన వేరుశనగ అందిస్తున్నట్లు చెప్పారు. విత్తన కాయ కోసం ఇప్పటి వరకు 35 వేల మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. కే-6, 1812 రకాలు ఇస్తామన్నారు. అర్ధ ఎకరా అంతకంటే తక్కువ ఉన్న రైతుకు ఒక బస్తా, ఎకరా పొలం ఉన్న రైతుకు రెండు బస్తాలు, ఎకరా కంటే ఎక్కువ ఉన్న రైతుకు 3 బస్తాల సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలు ఇస్తామన్నారు. ఇక వరి పండించే ప్రాంతాల్లో పచ్చిరొట్టి ఎరువు కోసం పిల్లిపెసర, జనుము విత్తనాలు 50 శాతం సబ్సిడీతో రైతులకు అందిస్తామన్నారు. ఈ నెల 30న వైఎస్సార్ రైతు భరోసాను రైతుల ఖాతాల్లోకి ముఖ్యమంత్రి జమ చేస్తారని తెలిపారు.

ఎంపీ లాడ్స్ పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ గౌతమి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో ఎంపీలు రంగయ్య, మాధవ్

అనంతపురం అర్బన్: ఎంపీ లాడ్స్ (లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ స్కీమ్) నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ గౌతమి ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలను ఆదేశించారు. కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అనంతపురం, హిందూపురం ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్‌తో కలిసి ఎంపీ లాడ్స్ పనుల ప్రగతిపై ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలతో సమీక్షించారు. ఎంపీ లాడ్స్‌కు సంబంధించి సవరించిన మార్గదర్శకాలను సీపీఓ ప్రేమ్‌చంద్ వివరించారు. ఎంపీ నిధులతో చేపట్టిన పనుల పురోగతిపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో రూ.14.49 కోట్ల అంచనాతో మంజూరైన 121 పనుల్లో 48 పనులు పూర్తికాగా, 58 పనులు పురోగతిలో ఉన్నాయని, 15 పనులు ఇంకా మొదలవ్వలేదన్నారు. హిందూపురం పార్లమెంటరీ నిధులకు సంబంధించి రూ.4.55 కోట్ల అంచనాతో మంజూరు చేసిన 88 పనుల్లో 48 పూర్తి చేశారని, 23 పనులు పురోగతిలో ఉన్నాయని, తొమ్మిది పనులు మొదలు కాలేదని వివరించారు. ఎంపీల నిధులతో చేపట్టిన పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీ లాడ్స్‌పై ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షించేందుకు వివరాలు ఇవ్వాలని సీపీఓను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలు పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈలు భాగ్యరాజ్, ఎహసాన్‌బాషా, ఆయా శాఖల ఇంజినీర్లు, గుంతకల్లు, రాయదుర్గం మునిసిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ప్రతిపాదనలు పంపండి : ఎంపీ రంగయ్య

ఎంపీ లాడ్స్ కింద ఇప్పటికే ప్రతిపాదించిన శ్మశానవాటికలు, భవన నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీ తలారి రంగయ్య ఆదేశించారు. ఇందుకు సంబంధించి నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించాలని చెప్పారు. వర్షాకాలం ప్రారంభం కాకముందే పనులు పూర్తి చేయాలని ఏజెన్సీలకు సూచించారు. శ్మశానవాటికల్లో ప్రహరీ నిర్మాణం, గేట్లు, తోరణం నిర్మాణ పనులు, కమ్యూనిటీ భవన నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించారు.

పనులు చేపట్టండి : ఎంపీ మాధవ్

ఎంపీ లాడ్స్ కింద చేపట్టిన అన్ని పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఎంపీ గోరంట్ల మాధవ్ సంబంధిత ఏజెన్సీలకు సూచించారు. నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా నిర్మాణ పనులు చేయాలని చెప్పారు.

ఇళ్ల లక్ష్యం పూర్తి చేయాలి

పేదలందరికీ ఇళ్లు పథకం కింద నిర్దేశించిన లక్ష్యం మేరకు ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణం అంశంపై కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ నుంచి మండల, డివిజన్, మునిసిపల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జూలై నెలాఖరుకు జిల్లాలో 19,193 ఇళ్లు పూర్తి చేయాలని లక్ష్యం కాగా.. ఇప్పటి వరకు 13,429 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారన్నారు. ఎస్‌హెచ్‌జీ సభ్యులకు రుణ సదుపాయం అందేలా చూడాలని అనంతపురం, రాయదుర్గం మునిసిపల్ కమిషనర్లు ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ కేశవనాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రక్తదానం మహాదానం



జోయ్‌దెబ్ రావత్‌ను సన్మానిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

అనంతపురంక్రైం: రక్తం దానం మహాదానమేనని కోల్‌కతాకు చెందిన ప్రముఖ సామాజికవేత్త జోయ్‌దెబ్ రావత్ అన్నారు. రక్తదానం ప్రాధాన్యతపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు జోయ్‌దేబ్ రావత్ దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న సైకిల్ యాత్ర అనంతపురం చేరింది. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ లక్ష్మణప్రసాద్, సభ్యులు జోయ్‌దెబ్ రావత్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా జోయ్‌దెబ్ రావత్ మాట్లాడుతూ రక్త దానం చేయడం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. రక్త దానం ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గతేడాది అక్టోబర్ 1న కలకత్తా నుంచి సైకిల్ యాత్రను ప్రారంభించానని తెలిపారు. ఇప్పటి దాకా వివిధ రాష్ట్రాల మీదుగా 16 వేల కిలో మీటర్ల దూరం ప్రయాణం చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులు ఆలంబన జనార్దన్, సుబ్రహ్మణ్యం, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శంకర్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆగిన రెండు బాల్య వివాహాలు

- ఆలస్యంగా వెలుగులోకి..

రాయదుర్గంటౌన్: చైల్డ్ లైన్ 1098, దిశ ఎస్‌ఓఎస్‌కు అందిన సమాచారం ఆధారంగా రెండు బాల్య వివాహాలు జరగకుండా అధికారులు నిలుపుదల చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాయదుర్గం పట్టణంలోని చేపలమార్కెట్‌లో నివాసముంటున్న బాలుడికి కర్ణాటకలోని నాగసముద్రానికి చెందిన బాలికతో ఈ నెల 24న వివాహం చేయాలని ఏర్పాట్లు చేశారు. ఒక రోజు ముందుగా ఓ మహిళ దిశ ఎస్‌ఓఎస్‌కు సమాచారం చేరవేసింది. రంగంలోకి దిగిన చైల్డ్ లైన్, పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు బాలబాలికల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. దీంతో వారు పెళ్లిని వాయిదా వేశారు. అలాగే గత సోమవారం గ్రామదట్ల గ్రామంలో కూడా తొమ్మిదో తరగతి చదివే బాలికకు వివాహం నిశ్చయించగా.. చైల్డ్ లైన్‌కు వచ్చిన సమాచారంతో అధికారులు గ్రామానికి చేరుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. దీంతో వారు పెళ్లి వాయిదా వేశారు. పెళ్లీడు వచ్చిన తర్వాతనే పెళ్లి చేస్తామని అధికారులకు తెలిపారు.

చల్ల చల్లగా ట్రాఫిక్ విధులు

- ట్రాఫిక్ సిబ్బందికి ఏసీ హెల్మెట్ల పంపిణీ



ఏసీ హెల్మెట్ తొడుగుతున్న డీఐజీ అమ్మిరెడ్డి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: భగభగ మండే ఎండల్లో ట్రాఫిక్ విధులు నిర్వర్తించే సిబ్బందికి ఉపశమన చర్యల్లో భాగంగా ఏసీ హెల్మెట్లను అందుబాటులోకి తెచ్చారు. మొదటి దశలో నాలుగు ఏసీ హెల్మెట్లను తెప్పించిన డీఐజీ ఆర్ఎన్ అమ్మిరెడ్డి శుక్రవారం అనంతపురం క్లాక్ టవర్ వద్ద ట్రాఫిక్ సీఐ వెంకటేశ్‌నాయక్‌కు ఏసీ హెల్మెట్ తొడిగి పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ కె.శ్రీనివాసరావుతో కలిసి డీఐజీ విలేకరులతో మాట్లాడారు. ఏసీ హెల్మెట్లను ధరించి విధులు నిర్వహించవచ్చన్నారు. అత్యాధునిక టెక్నాలజీతో రూపొందించిన ఈ హెల్మెట్ పెట్టుకుంటే తలకు చల్లని గాలి తగులుతూ అలసిపోకుండా, వడదెబ్బకు గురికాకుండా ఉంచుతుందన్నారు. ఒకసారి చార్జింగ్ పెడితే 8 గంటలపాటు ఏసీ హెల్మెట్ పనిచేస్తుందన్నారు. వీటి పనితీరు బాగుంటే ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ముఖ్య పట్టణాల్లోని పోలీసు సిబ్బందికి పంపుతామన్నారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో అవసరానికి అనుగుణంగా సిబ్బందిని సర్దుబాటు చేస్తామన్నారు. నగరంలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు.

ప్రమాదాల నియంత్రణే ప్రధాన లక్ష్యం

రోడ్డు ప్రమాదాల నియంత్రణే ప్రధాన లక్ష్యమని డీఐజీ తెలిపారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 42 బ్లాక్ స్పాట్‌లను గుర్తించామన్నారు. ప్రమాదాలతో ప్రాణాలు పోరాదన్న లక్ష్యంతో బ్లాక్ స్పాట్‌ల వద్ద ప్రత్యేక జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు మానవ తప్పిదాలతో చోటు చేసుకోకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

క్లుప్తంగా

రైతు ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యకు యత్నించిన రైతు పెద్దన్న

నార్పల: రెవెన్యూ అధికారులు తమకు న్యాయం చేయలేదంటూ ఓ రైతు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యకు యత్నించిన ఘటన శుక్రవారం మండల కేంద్రంలో చేటుచేసుకుంది. బాధితుల వివరాలమేరకు... మండల పరిధిలోని తుంపెరకు చెందిన పెద్దన్న అనే రైతుకు గూగూడు రెవెన్యూ పొలం సర్వే నెంబర్–58/3లో ఐదు ఎకరాల భూమి ఉంది. అయితే అతడి భూమి వేరే వారి పేరు మీద ఆన్‌లైన్‌లో ఎక్కడంతో తన పేరు మీదకు మార్చాలని పెద్దన్న.. గత రెండేళ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగారు. ఈ క్రమంలోనే శుక్రవారం కూడా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి సమస్యను తెలియజేసినా ఎవరూ పట్టించుకోలేదు. మనస్థాపం చెందిన పెద్దన్న తహసీల్దార్ కార్యాలయం వద్ద వాస్మాయిల్ తాగి ఆత్మహత్యకు యత్నించారు. గమనించిన స్థానికులు 108 వాహనంలో పెద్దన్నను జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. స్పందనలో సమస్య తెలిపిన న్యాయం జరగలేదని, తన తండ్రికి ఏమైనా జరిగితే రెవెన్యూ అధికారులే పూర్తి బాధ్యత వహించాలని పెద్దన్న కుమారుడు నరేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

పడిలేచిన కెరటం.. రామయ్య!

పేదరికం చదువుకు అడ్డుకాదని నిరూపించారు మొగలి రామయ్య. నా అనే వారంతా దూరమై.. పేదరికం వెక్కిరిస్తున్నా.. చదువునే ఆయుధంగా చేసుకొని ఉన్నతస్థాయికి చేరుకున్నారు. శాస్త్రవేత్తగా పనిచేస్తున్నా ఇంకా సాధించాల్సింది ఎంతో ఉందంటూ తన పయనాన్ని సాగిస్తున్నారు.

- కష్టాల కడలి నుంచి ఉన్నతస్థాయికి..
- తల్లిదండ్రులు లేకపోయినా శాస్త్రవేత్తగా ఎదిగిన వైనం
- రెండు స్వర్ణాలతో అందరికీ ఆదర్శం
- పేదరికం చదువుకు అడ్డుకాదంటున్న రామయ్య



న్యూఢిల్లీలో జరిగిన 61వ కాన్వొకేషన్‌లో భారత ఉప రాష్ట్రపతి జగదీష్ ధన్‌కర్ చేతుల మీదుగా స్వర్ణ పతకం అందుకుంటున్న మొగలి రామయ్య (ఫైల్)



కళ్యాణదుర్గం: చదవాలన్న పట్టుదల ఉంటే చాలు ఉన్నతస్థాయికి చేరవచ్చని ఇప్పటికే ఎంతో మంది నిరూపించారు. ఆ కోవలోకే వస్తారు కేవీకేలో కీటక విభాగం శాస్త్రవేత్తగా పనిచేస్తున్న మొగిలి రామయ్య. ఆయనది వైఎస్సార్ జిల్లా చాపాడు మండలంలోని పల్లవోలు అనే ఒక చిన్న గ్రామం. తల్లిదండ్రులు మొగలి సావిత్రి, రామాంజినేయులు. వారిని చూసిన జ్ఞాపకమైనా అతనికి మిగల్లేదు. అనారోగ్యంతో ఇరువురూ తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయినా రామయ్య జేజి (అవ్వ) బాల గురమ్మ మాత్రం మనవడికి అండగా నిలిచింది. పశువుల పేడ సేకరించి పిడకలు చేసేది. రాలిన వేపకాయలు గంప నిండా ఏరుకుని అమ్మేది. వచ్చిన అరకొరా చిల్లరతో జీవనం సాగించేవారు. జేజితో పాటు తను ఎంతో ప్రేమించే అక్షరాలు కూడా రామయ్యను ఉన్నతస్థాయిలో నిలబెట్టాయి.

గురువుల ప్రోత్సాహంతోనే...

రామయ్య 1 నుంచి 5వ తరగతి వరకు తన సొంత గ్రామమైన పల్లవోలు ప్రభుత్వ పాఠశాలలో చదివారు. ఆ తరువాత 6 నుంచి 10 వరకు మండల కేంద్రమైన చాపాడులోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివారు. ఇంతలో రామయ్య జేజి గుర్రమ్మకు వయసు మీద పడటంతో పనిచేయడం కష్టమైంది. రామయ్య తన చదువు పదో తరగతితో ఆగిపోతుందేమోనని అనుకున్నారు. ఇదే సమయంలో హైస్కూల్లో పాఠాలు చెప్పిన రమణయ్య అనే మాస్టర్ రామయ్య ఇంటికొచ్చారు. తన జేజితో మీ వాడు గొప్పవాడు అవుతాడు, కచ్చితంగా చదివించు, నేను తోడుగా ఉంటానని భరోసా ఇచ్చారు.

వ్యవసాయంపై మక్కువ..

రామయ్యకు వ్యవసాయ రంగంపై మీద ఉన్న ఆసక్తిని గమనించిన రమణయ్య మాస్టారు రూ.300తో అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కోసం దరఖాస్తు చేయించారు. అనుకున్నట్లే రామయ్యకు వైఎస్సార్ జిల్లా ఊటుకూరు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో సీటు వచ్చింది. ఇక అక్కడ నుంచి రామయ్య వెనక్కి తిరిగి చూడలేదు. ఎన్ని అడ్డంకులు ఎదురొచ్చినా పట్టుదలతో బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేశారు. బీఎస్సీ చదువుతుండగానే జేఆర్ఎఫ్ (అవార్డింగ్ ఆఫ్ జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్) పరీక్ష రాశారు. తాను చదివే కళాశాల పెట్టినప్పటి నుంచి జేఆర్ఎఫ్‌కు ఎవరూ క్వాలిఫై కూడా కాలేదు. ఇందులో రామయ్యకు 12వ ర్యాంక్ వచ్చింది. తాను చదివిన కళాశాలకే ఉన్నతమైన గౌరవాన్ని తెచ్చిపెట్టారాయన.

అగ్రిసెట్‌లో స్టేట్ 2వ ర్యాంకు..

పాలిటెక్నిక్ చదివే సమయంలో కిరణ్‌కుమార్ అనే అధ్యాపకుడు కీటక శాస్త్రాన్ని బోధించేవారు. రామయ్య ఆసక్తిని గమనించి అగ్రిసెట్‌ను రాయించారు. అగ్రిసెట్‌లో స్టేట్ 2వ ర్యాంకు సాధించారు రామయ్య. కోరుకున్న విధంగానే తిరుపతి ఎస్వీ అగ్రికల్చర్ కాలేజ్‌లో బీఎస్సీ (అగ్రికల్చర్) సీటు వచ్చింది. ఆ సమయంలో రామయ్య జీవితంలో అనుకోని విషాదం ఎదురైంది. తనకున్న ఏకైక ఆదరువు తన జేజి తన నుంచి శాశ్వతంగా దూరమైంది. అంత దుఃఖంలోనూ తను ప్రేమించిన చదువును మాత్రం వదల్లేదు. అప్పటి నుంచి కిరణ్ కుమార్ మాస్టారే రామయ్యకు అన్నీ తానయ్యారు. బీఎస్సీ పూర్తి చేసే క్రమంలో ఢిల్లీలో కీటకశాస్త్రం చదువుతున్న రాజశేఖర్‌ను కిరణ్‌కుమార్ మాస్టారు పరిచయం చేశారు. ఆ పరిచయం పై చదువులకు ఉపయోగపడింది.

కేవీకేలో శాస్త్రవేత్తగా బాధ్యతలు..

తిరుపతిలో బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేశాక ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ (పీజేటీఎస్ఏయూ)లో రామయ్య ఎమ్మెస్సీ అగ్రికల్చర్ చదివారు. అప్పటి నుంచి తనకు వచ్చే ఫెలోషిప్‌తోనే ఎమ్మెస్సీ పూర్తిచేశారు. ఆ తర్వాత వెంటనే జరిగిన నియామకాల్లో రామయ్యకు శాస్త్రవేత్తగా అవకాశం లభించింది. నేరుగా కళ్యాణదుర్గం కేవీకేలో కీటకశాస్త్ర శాస్త్రవేత్తగా ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం దేశంలోని అత్యున్నత సంస్థ ఐసీఏఆర్ – ఐఏఆర్ఐ న్యూఢిల్లీలో సీటు సంపాదించి ప్రొఫెసర్లు డెబ్జానిడే, నరేష్ సహకారంతో పీహెచ్‌డీ పూర్తి చేశారు.

చదువుకు పేదరికం అడ్డుకాదు



రైతులు సులభమైన పద్ధతుల్లో వ్యవసాయం చేసేలా కొత్త ఆవిష్కరణలు చేసేందుకు కృషి చేస్తున్నాను. చిన్నప్పటి నుంచి ఇంతటి స్థాయికి ఎదిగేలా కృషి చేసింది నా గురువులే. పదో తరగతిలో చదువు మానేస్తానేమోనన్న భయంతో ఉన్న నన్ను గురువులు ఈ స్థానంలో నిలబెట్టారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా మరింతగా కష్టపడి మంచిపేరు తెచ్చుకుంటా. పేదరికం చదువుకు అడ్డుకాదు...ప్రతి ఒక్కరూ ఉన్న అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థాయికి ఎదగాలి.

– మొగలి రామయ్య, కీటకశాస్త్రం శాస్త్రవేత్త

ఒకేసారి రెండు స్వర్ణాలు..

ఇటీవల ఢిల్లీలో జరిగిన భారత వ్యవసాయ పరిశోధన సంస్థ 61వ కాన్వొకేషన్‌లో రెండు స్వర్ణ పతకాలను అందుకున్నారు. ఒకటి కీటకశాస్త్ర విభాగంలో, మరొకటి ఆ యూనివర్సిటీ టాపర్‌గా అందుకోవడం గమనార్హం. ప్రస్తుతం రామయ్య... ఐసీఏఆర్ నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ ట్రైనింగ్‌లో ఉన్నారు. శిక్షణ పూర్తికాగానే మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్ వెల్ఫేర్‌లో మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ ఐసీఏఆర్ సైంటిస్టుగా బాధ్యతలు చేపట్టనున్నారు.

రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



మృతుడు సిద్దాలన్న గారి బాలన్న

తాడిపత్రి: మండల పరిధిలోని ఇగుడూరువద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త సిద్దాలన్న గారి బాలన్న (65) మృతి చెందగా, మరో ఇరువురు మహిళలు గాయపడ్డారు. స్థానికుల వివరాలమేరకు.. పెద్దపప్పూరు మండలంలోని కుమ్మెతకు చెందిన సిద్దాలన్న గారి బాలన్న ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవారు. వైఎస్సార్‌సీపీలో చురుకైన కార్యకర్తగా ఉండేవారు. శుక్రవారం తాడిపత్రికి వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో ఇరువురు మహిళలు, ఒక బాలిక ఆటోలో ఎక్కారు. ఇగుడూరు వద్దకు రాగానే గుత్తి వైపు నుంచి తాడిపత్రికి వస్తున్న ఐచర్ వాహనం ఆటోను వెనుక నుంచి ఢీ కొంది. ప్రమాదంలో బాలన్న అక్కడికక్కడే మృతి చెందారు. ఆటోలో ప్రయాణిస్తున్న శివమ్మ, చంద్రకళలకు గాయాలయ్యాయి. మృతుడికి భార్య రంగమ్మతో పాటు ఇరువురు కుమారులు, కుమార్తెలు కాగా వారిలో ఒక కుమారుడికి వివాహం కాలేదు. విషయం తెలుసుకున్న పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

30 నుంచి 'అనంత'లో ఆర్‌టీఐ క్యాంప్ కోర్టు

అనంతపురం అర్బన్: సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) క్యాంపు కోర్టును రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్ హరిప్రసాద్‌రెడ్డి ఈనెల 30, 31 తేదీల్లో రెండు రోజుల పాటు అనంతపురంలో నిర్వహించనున్నట్లు ఆ శాఖ అసిస్టెంట్ రిజిస్టర్ సమాచారం ఇచ్చారని డీపీఆర్‌ఓ రమేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన దరఖాస్తుదారులకు ఆ శాఖ ఇప్పటికే నోటీసులు పంపించినట్లు పేర్కొన్నారు.

ఉరవకొండకు చేరిన బైక్ యాత్ర



ఉరవకొండలో బైక్‌యాత్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు

ఉరవకొండ: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించి మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పగ్గాలు చేపట్టాలని కోరుతూ చేపట్టిన బైక్ యాత్ర శుక్రవారం ఉరవకొండకు చేరుకుంది. బైక్‌యాత్ర చేపట్టిన నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం యల్లంకి మండలం అన్నవరం గ్రామానికి చెందిన రాజు మాట్లాడుతూ ఈనెల 14న నెల్లూరు జిల్లా నుంచి చేపట్టిన బైక్‌యాత్ర రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల మీదుగా సాగుతుందన్నారు. 35 నియోజకవర్గాలను పూర్తి చేసుకొని రాయదుర్గం మీదుగా ఉరవకొండకు యాత్ర చేరిందన్నారు. 2024 లో 175కు 175 అసెంబ్లీ స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకోని మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలని కోరుతూ ప్రతి గ్రామంలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తు బైక్‌యాత్ర చేపట్టామన్నారు. ఉరవకొండలో చేపట్టిన బైక్‌యాత్రకు వైస్ ఎంపీపీ నరసింహులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అశోక్, ఏసీ ఎర్రిస్వామి, ఆంజనేయులు, అంగదాల అంజి, భీమా, హనుమప్ప, బాలాజీ స్వాగతం పలికారు.

పది రోజుల్లో పెళ్లి .. రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



పూజారి రమేష్ (ఫైల్)

బొమ్మనహాళ్: పది రోజుల్లో పెళ్లి పీటలు ఎక్కాల్సిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో అర్ధాంతరంగా తనువు చాలించారు. కేఎస్ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీ కొని బొమ్మనహాళ్ మండలం నేమకల్లు గ్రామానికి చెందిన పూజారి రమేష్ (22) అనే యువకుడు మృతి చెందిన సంఘటన కర్ణాటకలోని బళ్లారి సమీపం కొలూరుక్రాస్ వద్ద చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు... నేమకల్లుకు చెందిన వైస్ సర్పంచు పూజారి తిమ్మప్ప కుమారుడు పూజారి రమేష్ క్రషర్‌లో పనిచేస్తున్నారు. జూన్ 8న రమేష్ వివాహం ఉండటంతో బంధువులకు ఆహ్వాన పత్రికలు ఇవ్వడం కోసం స్నేహితుడు గొల్ల అనిల్‌తో కలిసి ద్విచక్ర వాహనంలో బళ్లారికి వెళుతుండగా కోలూరు క్రాస్ వద్దకు రాగానే కేఎస్ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీ కొట్టింది. పూజారి రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. గొల్ల అనిల్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

ఇంటర్ పరీక్షలకు 685 మంది గైర్హాజరు

రాప్తాడురూరల్: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా శుక్రవారం జరిగిన గణితం –1ఏ, బాటనీ–1, సివిక్స్–1, గణితం–2ఏ, బాటనీ–2, సివిక్స్–2 పరీక్షలకు 685 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 77 కేంద్రాల్లో జరిగిన మొదటి సంవత్సరం జనరల్, ఒకేషనల్ పరీక్షలకు 11,492 మంది విద్యార్థులకుగాను 11,034 మంది హాజరయ్యారు. 458 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 77 కేంద్రాల్లో జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 5,551 మంది విద్యార్థులకు గాను 5,324 మంది హాజరయ్యారు. 227 మంది గైర్హాజరయ్యారు.

ఎంటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో నిర్వహించిన ఎంటెక్ ఒకటో సెమిస్టర్ (ఆర్–21) రెగ్యులర్, సప్లిమెంటరీ , ఎంటెక్ ఒకటో సెమిస్టర్ (ఆర్–17), రెండో సెమిస్టర్ (ఆర్–21) సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ఈ.కేశవరెడ్డి , కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ బి.చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. పరీక్ష ఫలితాలకు http://jntuaresults.ac.in వెబ్‌సైట్ చూడాలన్నారు.

పల్నాడు డీపీఆర్‌ఓగా ఓంప్రకాష్‌రెడ్డి



అనంతపురం అర్బన్: పల్నాడు జిల్లా పౌర సంబంధాల అధికారిగా (డీపీఆర్‌ఓ) ఓంప్రకాష్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఉత్తర్వులను ఆ శాఖ కమిషనర్ ఈనెల 25న జారీ చేశారు. ఓంప్రకాష్‌రెడ్డి ప్రస్తుతం జిల్లా ఏపీఆర్‌ఓగా విధులు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న మూడు డీపీఆర్‌ఓ పోస్టుకు ఏపీపీఎస్సీ నిర్వహించిన పరీక్షలో ఆయన ఉత్తీర్ణత సాధించి డీపీఆర్‌ఓగా ఎంపికయ్యారు. దీంతో ఆయనకు తొలిపోస్టింగ్ పల్నాడు జిల్లా డీపీఆర్‌ఓగా ప్రభుత్వం అవకాశం కల్పించింది. డీపీఆర్‌ఓగా జూన్ 1వ తేదీన జాయిన్ అవుతున్నట్లు ఓంప్రకాశ్ తెలిపారు.

పెన్షనర్లు ఈ-కేవైసీ చేసుకోవాలి

అనంతపురం టవర్‌క్లాక్: పెన్షనర్స్ ఈ–కేవైసీ చేసుకోవాలి రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్దన్న గౌడు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ–కేవైసీ ఈ నెలాఖరు కల్లా చేసుకోవాలని ఎన్జీఓను హోంలోని ఎస్టీఓ కలవాలన్నారు. మరిన్ని వివరాలకు 6304535837, 9491863589 నంబర్లను సంప్రదించాలన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

- ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



ప్రతిభా పురస్కారాలు అందిస్తున్న ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం రూరల్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పదోతరగతి పరీక్షా ఫలితాల్లో సత్తాచాటిన బెస్త విద్యార్థులకు గంగపుత్ర కమ్యూనిటీ హాలులో బెస్త సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందించారు. ముఖ్య అతిథులుగా ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ కేవీ రమణ హాజరయ్యారు. ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కష్టపడి చదివిన ప్రతి విద్యార్థీ తప్పకుండా ఉన్నత శిఖరాలు చేరుకుంటారన్నారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు పెద్దపీట వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ తిప్పమాంబ, బెస్త సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శి భాస్కర్, శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి నాగార్జున, కదిరి మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ వెంకటేష్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నాయకులు శ్రీనివాసులు, బెస్త సంఘం నాయకులు పాల్గొన్నారు.

కక్షలు లేని సమాజాన్ని నిర్మించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: 'నియోజకవర్గంలో కక్షలు లేని సమాజాన్ని తయారు చేయడమే ప్రధాన లక్ష్యం.. ఫ్యాక్షన్ జోలికి ఎవరూ వెళ్లకుండా ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగానే ప్రజా సంక్షేమ యాత్ర పేరిట గ్రామాల్లో పాదయాత్ర చేస్తున్నా' అని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. శుక్రవారం ప్రజా సంక్షేమ యాత్ర 11వ రోజు ముగింపులో భాగంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రికి చేరుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లోని ప్రజలు, వారికి సంబంధించిన వ్యక్తిగత సమస్యలు, సంక్షేమ పథకాలకు సంబంధించిన సమస్యలు, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు పాదయాత్ర మంచి మార్గమన్నారు. వారు చెప్పిన సమస్యలను అధికారులకు ఎప్పటికప్పుడు తెలియజేసి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునేలా చూస్తున్నామన్నారు.

తాడిపత్రి ప్రశాంతంగా ఉంది

తాను ఎమ్మెల్యేగా గెలుపొందిన నాటి నుంచి ఇప్పటి వరకు తాడిపత్రి నియోజకవర్గం ప్రశాంతంగా ఉందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తెలిపారు. నాలుగు సంవత్సరాల కాలంలో గ్రామాల్లో ఎక్కడ కూడా కక్ష్యలు, కార్పణ్యాలు నెలకొన్న పరిస్థితులు లేవన్నారు. ఇలాంటి సమాజాన్నే తాను కోరుకుంటున్నానన్నారు. జేసీ సోదరులు తాడిపత్రిని అభివృద్ధి చేశామని నిత్యం ప్రగల్భాలు పలుకుతుంటారని ఎద్దేవా చేశారు. చాగల్లు రిజర్వాయర్‌ను నిర్మించింది తామేనని చెబుతుంటారని, కానీ ఏనాడైనా అందులో నీటిని నిల్వ చేసి, ప్రజలకు , రైతులకు చేసిన మేలు జరిగేలా చేశారా? అని ప్రశ్నించారు. గత నాలుగేళ్లలో తాడిపత్రి పెన్నానదికి నీటి ప్రవాహం ఎన్నడూ లేని విధంగా ప్రవహిస్తున్న మాట వాస్తవం కాదా లేదా అన్నది ప్రజలక బాగా తెలుసన్నారు. దాదాపు 30 సంవత్సరాల జేసీ సోదరుల పాలనతో ఏ నాడైనా చాగల్లు, యాడికి, పెద్దవడుగూరు మండలాల్లో రెండో పంటకు నీరిచ్చిన ఘనత ఉందా? అని ప్రశ్నించారు. రైతులు ఇబ్బందిలేకుండా వ్యవసాయం చేసుకునేలా నీరిచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. భవిష్యత్తులో తాడిపత్రిని అభివృద్ధిలో మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కోరారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే ధ్యేయం



విలేకరులతో మాట్లాడుతున్న జూపూడి ప్రభాకర్

అనంతపురం: వైఎస్సార్‌సీపీ గెలుపే ధ్యేయంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని రాష్ట్ర సామాజిక, న్యాయ ప్రభుత్వ సలహాదారు , రాష్ట్ర ఎస్సీ సంఘం గౌరవాధ్యక్షుడు జూపూడి ప్రభాకర్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని గుత్తి పట్టణంలో ఒక కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం అనంతపురం ఆర్డీటీ గెస్ట్ హౌస్‌లో విలేకరులతో మాట్లాడారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175కు 175 సీట్లు సాధించేలా ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని పలు ఎస్సీ సంఘాల నాయకులను కోరినట్లు పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడ్డవారిని తప్పనిసరిగా గుర్తిస్తామన్నారు. ఎస్సీలకు కేటాయించిన నియోజకవర్గ స్థానాల్లో 98 శాతం వైఎస్సార్‌సీపీ గెలిచిందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎస్సీ నియోజకవర్గ స్థానాల్లో 100 శాతం సీట్లు గెలిచేలా కృషి చేయాలని కోరారు. టీడీపీ, జనసేన పార్టీ పొత్తుకు సంబంధించి సీఎం అభ్యర్థి ఎవరు అనే అంశంపై వారికే స్పష్టత లేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు ఎగ్గుల శ్రీనివాసులు, నాయకులు రుద్రంపేట పురుషోత్తం, తలారి ఉష, మిద్దె కుళ్లాయప్ప, సులోచనమ్మ, బండారు శోభారాణి, మోగతల ఉషా, మిద్దె నగేష్, సాకే శివ శంకర్, రుద్రంపేట నాగరాజు, బుక్కరాయసముద్రం కాటమయ్య, తలారి భరత్ కుమార్, స్టీఫెన్, సాయిపోగుల వీరేష్ పాల్గొన్నారు.

నేడు ఎంఎస్ఎంఈల సమస్యలపై వర్క్‌షాప్

అనంతపురం టౌన్: ఎంఎస్ఎంఈల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కార మార్గలను చూపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా వర్క్‌షాప్‌లను ఏర్పాటు చేసినట్లు జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈల నిర్వాహకులకు కర్నూలు పట్టణ కేంద్రంలోని ఏ క్యాంప్ దగ్గర ఉద్యాభవన్‌లో శనివారం 10 గంటలకు వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎంఎస్ఎంఈల నిర్వాహకులు పాల్గొని క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేస్తే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు.

జిల్లాకు 691 మెట్రిక్ టన్నుల వైట్ పొటాష్

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్‌లో ఎరువుల కొరత ఏర్పడకుండా అవసరం మేరకు సరఫరా అవుతున్నట్లు అనంతపురం ఏడీఏ, రేక్ ఆఫీసర్ ఎం.వెంకటరాముడు తెలిపారు. శుక్రవారం ఆయన రాప్తాడు ఏఓ శుభకర్‌తో కలిసి స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకున్న పొటాష్ ఎరువుల వ్యాగన్‌ను పరిశీలించారు. ఇండియన్ పొటాష్ లిమిటెడ్ కంపెనీకి చెందిన మ్యూరేట్ ఆఫ్ పొటాష్ (వైట్) 691 మెట్రిక్ టన్నులు వచ్చిందన్నారు. ఉన్నతాధికారులు అనంతపురం జిల్లాకు 583 మెట్రిక్ టన్నులు, శ్రీసత్యసాయి జిల్లాకు 118 మెట్రిక్ టన్నులు కేటాయించారన్నారు.

క్లుప్తంగా

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు



కిశోర బాలికలు, తల్లులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ లలిత

అనంతపురం సెంట్రల్: 18 ఏళ్ల నిండకనే బాలికలకు పెళ్లి చేస్తే చట్టారీత్యా చర్యలు తప్పవని అర్బన్ సీడీపీఓ లలిత హెచ్చరించారు. శుక్రవారం 4వ సెక్టార్ పరిధిలోని రాణీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు, తల్లులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిర్మూలన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు తెచ్చాయన్నారు. చిన్న వయస్సులోనే పెళ్లిళ్లు చేయడం వల్ల భవిష్యత్‌లో అమ్మాయిలకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ హేమ, అంగన్‌వాడీ వర్కర్ లక్ష్మీ నరసమ్మ, హెల్పర్ పావని తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

ఆత్మకూరు: మండలంలోని గ్రామాల్లో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టులకు ఈనెల 28లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ విజయ్ ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బి. యాలేరులో -1, పి.యాలేరులో -1, సనప గ్రామంలో 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ నెల 30 ,31వ తేదీల్లో ఇంటర్వ్యూ ఉంటుందన్నారు.

రూ.6.21 కోట్లతో కాలువల నిర్మాణం



పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: నగరంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రూ.6.21 కోట్లతో కాలువల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు మేయర్ వసీం తెలిపారు. శుక్రవారం 26వ డివిజన్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.20 లక్షల వ్యయంతో జరుగుతున్న కాలువ నిర్మాణ పనులు మేయర్ పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఈఈ చంద్రశేఖర్‌ను మేయర్ ఆదేశించారు. నగరంలో గత 40 ఏళ్లలో జరగని అభివృద్ధి సాధ్యపడుతోందన్నారు. కార్పొరేటర్ కమల్‌భూషణ్, నాయకులు నాగార్జున రెడ్డి, పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు.నగరంలో ట్రాఫిక్ సమస్యకు పుల్‌స్టాప్ పెట్టేందుకు అనంత పోలీసులు శ్రీకారం చుట్టారు. అనంతపురం త్రీటౌన్ పోలీసులు ఆటోవాలాలు, దుకాణదారులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో జరిగే నష్టాలు, రాంగ్ పార్కింగ్‌తో కలిగే ఇబ్బందులు వివరించారు. సజావుగా వాహనాలను నడపడం వల్ల ఎలాంటి ప్రయోజనాలుంటాయో చెప్పారు. ప్రతి వాహనదారుడు పోలీసుల సూచనలను పాటించాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ ఎదుటి వాహనదారుడు, పాదాచారులకు అసౌకర్యం కలిగించకుండా చూడాలని సూచించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రాప్తాడు: రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం వైఎస్సార్ జలకళ పథకాన్ని ప్రవేశ పెట్టిందని ఉపాధిహామీ ఏపీడీ అనురాధ పేర్కొన్నారు. శుక్రవారం పంగల్ రోడ్డు సమీపంలోని టీటీడీసీ కేంద్రంలో హంపాపురంలోని ముగ్గురు రైతులు సాకే నారాయణ స్వామి, బీరే పార్వతి, జానగాని వెంకటలక్ష్మిలకు వైఎస్సార్ జలకళ ద్వారా మంజూరైన మోటార్లను పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నారాయణ స్వామి పాల్గొన్నారు.

తపోవనంలో చోరీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: తపోవనంలోని ఓ ఇంట్లో శుక్రవారం చోరీ జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు, నాల్గో పట్టణ పోలీసులు తెలిపిన మేరకు.. తపోవనంలో రామగిరి మండలం పోలేపల్లికి చెందిన కేశవ నాయుడు కుటుంబం నివాసం ఉంటోంది. కుటుంబం మొత్తం స్వగ్రామానికి వెళ్లారు. ఇదే అదును చూసి దుండుగలు చోరీ చేశారు. తలుపులు తెరిచి ఉండడాన్ని పారుగింటివారు శుక్రవారం ఉదయం గమనించి ఫోన్‌లో సమాచారం అందించారు. విషయం తెలిసిన వెంటనే బాధితులు ఇంటికి చేరుకొని పరిశీలించగా, బీరువాను ఇనుప చువ్వలతో మెండి అందులో ఉన్న రూ.40 వేలు నగదు, డైమండ్ కమ్మలు, విలువైన చీరలు, కొంత బంగారం ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

వలంటీర్లు నిస్వార్థ సేవకులు

• ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: వలంటీర్లు నిస్వార్థ సేవకులు.. ఇదే స్ఫూర్తితో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. శుక్రవారం నగరపాలక సంస్థలోని అదనపు సమావేశం హాల్‌లో వలంటీర్లకు వందనం కార్యక్రమం జరిగింది. 58 నుంచి 72, 74వ సచివాలయ పరిధిలోని 221 మంది వలంటీర్లను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏపీలో సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి సరికొత్త విప్లవానికి శ్రీకారం చుట్టారన్నారు. నీతి, నిజాయితీ, పారదర్శక పాలనందించడంలో సచివాలయ ఉద్యోగులను, వలంటీర్లను భాగస్వాములను చేసినట్లు తెలిపారు. అర్హతే ప్రామాణికంగా సచివాలయ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు పథకాలు అందుతున్నట్లు తెలిపారు.

అభివృద్ధిపై చైతన్యం తేవాలి:

సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో ఊహకందని విధంగా సంక్షేమం, అభివృద్ధి జరుగుతుంటే కొందరు కుట్ర రాజకీయాలు చేయడం సరికాదని ఎమ్మెల్యే అన్నారు. వైఎస్సార్ సీపీ నాలుగేళ్లలో నగరం నలుదిక్కులా జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించి, మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చేసుకోవడంలో వలంటీర్లు కార్యోన్ముఖులవ్వాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, జేసీఎస్ కన్వీనర్ కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, కార్పొరేటర్లు జయలలిత, చంద్రలేఖ, రాజేశ్వరి, శాంతిసుధ, శేఖర్‌బాబు, రహంతుల్లా, ఇస్సాక్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు అందుబాటులో ఉండాలి



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్

ఆత్మకూరు: అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన సేవలు అందించాలని అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ఓపీ విభాగం, ల్యాబ్, ఫార్మసీ, ప్రసవాల గది, పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో అసంక్రమిత వ్యాధుల సర్వే, ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంపై వైద్యసిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలోని ఓపీ రిజిష్టర్, రికార్డులను పరిశీలించారు.

టూవీలర్ మెకానిజంపై శిక్షణ

అనంతపురం: ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు టూ వీలర్ మెకానిజమ్ (బైక్ రిపేరీ) కోర్సు అందుబాటులోకి తెస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. టూ వీలర్ మెకానిజంతో పాటు కమ్యూనికేషన్స్ స్కిల్స్, ఇంగ్లిష్ భాషపై పట్టు, వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 29 నుంచి బ్యాచ్ ప్రారంభం అవుతుందన్నారు. 18 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. వివరాలకు సెల్: 9390505352, 7780752418 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆర్థిక భారం కాకుండా పెళ్లి కానుక, షాదీ తోఫా

• ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



పెళ్లికానుక, షాది తోఫాను అందజేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: పేదలకు ఆర్థిక చేయూతనందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, తల్లిదండ్రులపైనా ఆర్థిక భారం పడకుండా వైఎస్సార్ పెళ్లి కానుక, షాదీ తోఫాలతో అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో నగరంలోని 50వ డివిజన్‌కు చెందిన లిఖితా, షబానాలకు మంజూరైన పెళ్లి కానుక, షాదీ తోఫాలను వారి తల్లిదండ్రులకు ఒక్కొక్కరికి రూ.లక్ష ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గురుశేఖర్‌బాబు, 72వ సచివాలయ కార్యదర్శులు కుసుమ, కిషోర్, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చేరని పౌష్టికాహారం

• అంగన్‌వాడీ కార్యకర్తల నిర్వాకం



గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందచేస్తున్న దృశ్యం (ఫైల్)

ఆత్మకూరుకు చెందిన లక్ష్మి (బాలింత), రాధ (గర్భిణి) (పేర్లు మార్చాం) ఒకే ఇంట్లో ఉంటున్నారు. వీరికి నాలుగు నెలల నుంచి అంగన్‌వాడీ కేంద్రం ద్వారా పౌష్టికాహారం అందలేదు. ఇదేమని అంగన్‌వాడీ వర్కర్‌ను అడిగితే సరుకులు తక్కువ వచ్చాయని.. మళ్లీ వచ్చినపుడు ఇస్తామని సమాధానం చెప్పారు. అలా ఏమైనా ఇస్తారా అంటే ప్రతి నెలా ఇదే చెబుతున్నారని లక్ష్మి, రాధ వాపోతున్నారు. అలాగే ఆత్మకూరుకు చెందిన ఐదు నెలల గర్భిణి స్వప్న (పేరు మార్చాం) అంగన్‌వాడీ కేంద్రంలో పేరు నమోదు చేయించుకున్నా ఒక్కసారి కూడా పౌష్టికాహారం అందలేదు.

ఆత్మకూరు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే పౌష్టికాహారం కొందరు అంగన్‌వాడీ కార్యకర్తల నిర్వాకంతో లబ్ధిదారులకు చేరడం లేదు. మండల కేంద్రం ఆత్మకూరులో పి.యాలేరు రోడ్డులో ఉన్న రెండు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలకు నెలల తరబడి వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్టు అందలేదు. అడిగితే స్టాకు రాలేదని సమాధానం చెబుతున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇలా ఈ రెండు చోట్లే కాదు మండల వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందని అంటున్నారు. మండలంలో 47 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 307 మంది గర్భిణులు, 264 మంది బాలింతలు ఉన్నారు. గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా నెలలో 25 రోజుల పాటు ప్రతి రోజూ ఒక గుడ్డు, 200 మి.లీ పాలతో పాటు మధ్యాహ్నం వేడి భోజనం (బియ్యం-125 గ్రాములు, కందిపప్పు 30గ్రాములు, నూనె 16 గ్రాములు, ఆకుకూరలు/కూరగాయలు 125 గ్రాములు) అంగన్‌వాడీ కేంద్రంలో ఇవ్వాలి. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ (కిలో రాగిపిండి, కిలో జొన్న పిండి, కిలో అటుకులు, 250 గ్రాముల చిక్కీలు, 250 గ్రాముల ఎండు ఖర్జూరం, 250 గ్రాముల బెల్లం)అందించాలి. అయితే నాలుగు నెలలుగా తమకు స్టాకు రావడం లేదని పౌష్టికాహారం అందించడం లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.

మాకు ఫిర్యాదు చేయండి

అంగన్‌వాడీ కేంద్రాలకు ఇటీవల రెండుసార్లు మాత్రమే కోడిగుడ్లు సక్రమంగా అందలేదు. మిగిలిన అన్ని సరుకులూ వచ్చాయి. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందకపోతే మాకు ఫిర్యాదు చేయండి. విచారణ చేసి అందేలా చూస్తాం. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కార్యకర్తలపై చర్యలు తీసుకుంటాం.
– నేతాజీబీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఆత్మకూరు

ఎస్పీబీ జయంతి కరపత్రాల విడుదల



కరపత్రాలను విడుదల చేస్తున్న డీఈఓ సాయిరామ్

రాప్తాడురూరల్: గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం 77వ జయంతిని పురస్కరించుకొని జూన్ 4న 'పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతి' సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'ఎస్పీ బాలు సంగీత విభావరి' కరపత్రాలు డీఈఓ ఎం.సాయిరామ్ శుక్రవారం విడుదల చేశారు. 'పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతి' సంస్థ అధ్యక్షుడు సుగుమంచి సురేష్ బాబు మాట్లాడారు. మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్న పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతి సంస్థ ప్రతినిధులను డీఈఓ అభినందించారు. కార్యక్రమంలో సంస్థ కోశాధికారి ఆదినారాయణ, ఉపాధ్యక్షులు సూర్యనారాయణ, కార్యదర్శులు కేశవ, విజయరామయ్య, నరసింహులు, మునిరత్నం పాల్గొన్నారు.

సహకార బ్యాంకులను ఆర్‌బీఐ గుర్తించాలి

• ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ సత్యనారాయణమూర్తి



మాట్లాడుతున్న ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ సత్యనారాయణమూర్తి

అనంతపురం అర్బన్: మధ్యతరగతి కుటుంబాలకు అన్ని విధాలా ఆర్థిక చేయూత అందిస్తున్న సహకార రంగ బ్యాంకులను ఆర్‌బీఐ గుర్తించాలని ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణమూర్తి అన్నారు. శుక్రవారం అనంతపురం నగరంలో ఓ ఫంక్షన్ హాల్‌లో ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ సభ్యుల మహాసభ నిర్వహించారు. కోఆపరేటివ్ బ్యాంక్ అనంతపురం శాఖ ఇన్‌చార్జ్ డైరెక్టర్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సత్యనారాయణమూర్తి, మేనేజర్లు సత్యనారాయణ, ప్రసాద్‌రావు, ఇన్‌చార్జ్ బ్రాంచ్ మేనేజర్ రమేశ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ సహకార రంగంలో ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ అత్యుత్తమ స్థానంలో నిలిచిందన్నారు. కోఆపరేటివ్ బ్యాంకుకు యాజమాన్యం ఉండదన్నారు. జూన్ 26న విశాఖపట్నంలో నిర్వహించనున్న 108వ మహాజన సభ ప్రతినిధుల హాజరు తదితర అంశాలపై వక్తలు ప్రసంగించారు. కార్యక్రమంలో న్యాయ సలహాదారు వేణుగోపాల్, అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ రమణ, డైరెక్టర్లు బాషా, రామాంజనేయులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి 'అమ్మ' చేయూత



విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: పేద విద్యార్థి చదువుకు 'అమ్మ' సంస్థ చేయూతనందించింది. పుట్టపర్తి నుంచి అనంతకొచ్చి స్థిరపడిన ఫక్రుద్దీన్ బాబా, మాబిన్‌తాజ్ దంపతులు రోజువారి కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారి కొడుకు మహ్మద్ సాహిద్ ప్రతిభావంతుడైనా ఆర్థిక స్థోమత లేక చదువు మధ్యలోనే ఆగిపోతుందేమోనని మదనపడుతుండేవారు. ఇటీవల కలికిరి సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో మంచి ర్యాంక్ వచ్చింది. ప్రవేశ రుసుం కింద తొలి ఏడాది రూ. లక్షకు పైగా కట్టాల్సి రావడంతో ఇబ్బంది పడుతున్న సాహిద్‌కు అమ్మ సంస్థ అండగా నిలిచింది. శుక్రవారం రూ.25 వేలు ఆర్థిక సాయం అందించింది. అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి మాట్లాడుతూ వచ్చే ఏడాది నుంచి కేంద్ర ప్రభుత్వమే ఫీజు రీఎంబర్స్‌మెంట్ కింద చదివిస్తుందన్నారు. మొదట్లో ప్రవేశానికి డబ్బు లేక సతమతవుతుండడంతో సాయమందించామన్నారు. త్వరలో అతనికి కావాల్సిన పుస్తకాలు, ఇతర విద్యా సామగ్రి అందిస్తామని భరోసా ఇచ్చారు.

30 పడకల ఈఎస్‌ఐ ఆస్పత్రిగా మార్చండి

• సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు



ఈఎస్‌ఐ అధికాకి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

అనంతపురంక్రైం: జిల్లా కేంద్రంలోని ఈఎస్‌ఐ ఆస్పత్రిని 30 పడకల ఆస్పత్రిగా మార్చాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు డిమాండ్ చేశారు. శుక్రవారం అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ నుంచి శ్రీకంఠం సర్కిల్ మీదుగా ఈఎస్‌ఐ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ నిరసన తెలిపారు. అనంతరం ఈఎస్‌ఐ అధికారి మోహన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జి. ఓబులు మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో కీలకంగా ఉన్న కార్మికుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం సరికాదన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈఎస్‌ఐ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌ను నెలకొల్పాలని కోరారు. డిస్పెన్సరీలలో డాక్టర్లు, సిబ్బంది, పరికరాలు, మందులు తగినంత స్థాయిలో అందుబాటులో ఉంచాలన్నారు. 10 మంది లోపు కార్మికులు ఉన్న సంస్థలలో కూడా ఈఎస్‌ఐ పథకాన్ని ప్రారంభించాలన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వేలాది మంది కార్మికులు ప్రభుత్వ ప్రైవేటు సంస్థలలో పని చేస్తున్న వారందరికీ ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి వెంకటనారాయణ, నాగభూషణం, ఎర్రిస్వామి, తిరుమలేష్, నాగరాజు, రాము, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

దాబాలో మద్యం విక్రయిస్తే చర్యలు

రాప్తాడు: దాబాలు, రెస్టారెంట్స్, హోటళ్లలో మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకట శివారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ ఆంజనేయులుతో కలిసి మండలంలో ఉన్న దాబాలు, రెస్టారెంట్లు, హోటల్ నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ దాబాలు, రెస్టారెంట్స్, హోటల్స్‌లో మద్యం విక్రయించరాదన్నారు. ఎవరైనా మద్యం విక్రయిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రాత్రి పూట అనుమానాస్పద వ్యక్తుల కదలికలను పోలీసులకు తెలియజేయాలన్నారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'గీతలు చెడిపి' కథకు ప్రథమ బహుమతి

అనంతపురం కల్చరల్: పాలపిట్ట మాస పత్రిక ఆధ్వర్యంలో నిర్వహించిన కథల పోటీల్లో జిల్లాకు చెందిన వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కార గ్రహీత డాక్టర్ శాంతినారాయణ కథ 'గీతలు చెడిపి' కథకు ప్రథమ బహుమతి వచ్చింది. ఆదిలక్ష్మి సత్యనారాయణ స్మారక కథల పోటీలు నిర్వహించారు. అందులో శాంతినారాయణ రాసిన 'గీతలు చెడిపి' కథ మొదటి బహుమతికి ఎంపికయిందని, ఆయనకు రూ. 7 వేల నగదు బహుమతి అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పెయింటర్ దారుణ హత్య

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సిద్దయ్యగుట్ట అర్బన్ హెల్త్ సెంటర్ పక్కన ఓ పెయింటర్‌ను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు బండరాళ్లతో దారుణంగా హత్య చేశారు. వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం వివరాల మేరకు... అనంతపురానికి చెందిన సాకే ఓబిలేసు, ముత్యాలమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. సాకే నవీన్ (23), సాకే సాయి పెయింటింగ్ పనులు చేసుకుంటూ ఒకటిన్నర సంవత్సరం క్రితం ధర్మవరానికి వలస వచ్చారు. ధర్మవరంలో పెయింటింగ్ పనులు చేసుకుంటూ అన్నదమ్ములు మద్యానికి బానిసయ్యారు. శుక్రవారం రాత్రి సాకే నవీన్, తమ్ముడు సాయితో పాటు మరి కొంతమంది మద్యం తాగి గొడవ పడ్డారు. గుర్తు తెలియని వ్యక్తులు సాకే నవీన్‌ను బండరాళ్లతో మోది హత్య చేశారు. స్థానికుల సమాచారం మేరకు వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం ఘటనా స్థలానికి చేరుకుని నవీన్ మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని తమ్ముడు సాకే సాయిని విచారించారు. ధర్మవరంలోని కేతిరెడ్డికాలనీలో ఉంటున్న మృతుని బంధువులకు సమాచారం అందించారు. మృతుని బంధువులు వచ్చి మృతదేహాన్ని చూసి కన్నీరు మున్నీరుగా విలపించారు. సాకే నవీన్‌కు గతంలోనే గంగోత్రి అనే అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకుని రెండేళ్ల క్రితమే వదిలేసినట్లు బంధువులు తెలిపారు. వారికి రెండేళ్ల కుమారుడు ఉన్నారు. సాకే నవీన్‌ను ఎవరు హత్య చేశారు? తదితర వివరాలను మృతుడి తమ్ముడు ద్వారా తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పోలీసుల సమస్యలపై స్పందన

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పోలీసు సిబ్బంది సమస్యలపై జిల్లా ఎస్పీ నిర్వహించిన ×స్పందన×కు 9 వినతులు వచ్చాయి. పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎస్పీ శ్రీనివాసరావు శుక్రవారం స్పందన నిర్వహించారు. సిబ్బందితో ఎస్పీ ముఖాముఖి మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలనాధికారి శంకర్, జిల్లా పోలీసు అధికారుల సంఘం సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వజనాస్పత్రిలో సతాయించిన సర్వర్





సర్వజనాస్పత్రి ఓపీ కౌంటర్‌లో ఆధార్ నమోదు చేసి ఓపీ చీటీ ఇస్తున్న కంప్యూటర్ ఆపరేటర్, అడ్మిషన్ కౌంటర్ వద్ద బారులు తీరిన దృశ్యం



ఓపీ టికెట్ కోసం సిబ్బందితో వాగ్వాదానికి దిగిన రోగుల బంధువులు

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఈ హాస్పిటల్ విధానానికి ఆదిలోనే హంసపాదు అన్న చందంగా పరిస్థితి తయారైంది. అధికారులు నిర్వహించిన ట్రయల్ రన్ విఫలమైంది. శుక్రవారం ఉదయం ఓపీ 9 గంటలకు యధావిధిగా ప్రారంభమైంది. పురుషుల, మహిళల ఓపీ, అడ్మిషన్ కౌంటర్లలో రోగుల ఆధార్ వివరాలు నమోదు చేసే క్రమంలో సర్వర్ సమస్య తలెత్తడంతో ఓపీ తీసుకోవడానికి ఒక్కొక్కరికి 5 నిమిషాల నుంచి 10 నిమిషాల సమయం పట్టింది. ఓ వైపు ఓపీ సమయం అయిపోతుందని, మళ్లీ సాయంత్రం వరకు వేచి ఉండాల్సి వస్తుందని సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు ఆందోళన చెందారు. చివరకు కంప్యూటర్ ఆపరేటర్లతో వాగ్వాదానికి దిగారు. దీంతో సెక్యూరిటీ సిబ్బంది జోక్యం చేసుకొని పరిస్థితిని చక్కదిద్దారు. అనంతరం విషయాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాలతో పాత పద్ధతిలోనే ఓపీ ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోండి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి జిల్లా ఎస్పీ శ్రీనివాసరావును కోరారు. శుక్రవారం పేద ప్రజలను పట్టి పీడిస్తున్న అధిక వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్పీ కంచే శ్రీనివాస రావుకు వినతి పత్రాన్ని అందించారు. పోలీసులు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. జేఏసీ నాయకులు రేకలకుంట రామాంజనేయులు పాల్గొన్నారు.

29న వలీస్వామి ఆరాధన

అనంతపురం కల్చరల్: అవధూత స్వరూపులు శ్రీ వలీస్వామి ఆరాధనోత్సవాన్ని ఈనెల 29న వైభవంగా నిర్వహిస్తున్నట్లు వలీస్వామి ఆశ్రమ నిర్వాహకులు విజయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 7 గంటలకు వెంకటాపురంలోని స్వామి వలీస్వామి మహాసమాధి వద్ద చందన పూజలు, అభిషేకాలు, అన్నప్రసాదం వితరణ ఉంటుందన్నారు.